నేటి దినపత్రిక
# సూర్య
18వ వసంతంలోకి
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
మంగళవారం | 29 అక్టోబర్ 2024 | పేజీలు 8

## అర్జీలు వేగవంతంగా పరిష్కరించాలి : కలెక్టర్ ఆనంద్



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుండి వచ్చిన అర్జీలను వేగవంతంగా పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో రెవెన్యూ అంశాలపై ఎక్కువ శాతంలో అర్జీలు వస్తున్నాయన్నారు. ముఖ్యంగా రెవెన్యూ, భూ సర్వే సమస్యలపై అర్జీలు ప్రజల నుండి వస్తున్నాయన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక -మిగతా 2లో

■ అదానీలకు దండం పెట్టి అడుగుతున్నాం..

# కంటైనర్ టెర్మినల్ పునరుద్ధరించండి

- కృష్ణపట్నం పోర్టులో కంటైనర్ టెర్మినల్ పునరుద్ధరణే లక్ష్యం
- అవసరమైతే కాళ్లు పట్టుకుంటాం.. లేదంటే పోరాటానికి దిగుతాం
- మీడియాతో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి




పోర్టు సీఈఓ జగదీష్ పటేల్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** అదానిలకు దండం పెట్టి అడుగుతున్నాం.. కంటైనర్ టెర్మినల్ సేవలను పునరుద్ధరణ చేయాలని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. సోమవారం కృష్ణపట్నం పోర్టుకు ఎమ్మెల్యే సోమిరెడ్డి వచ్చారు. ఈ సందర్భంగా అఖిలపక్ష నాయకులతో కలిసి పోర్టు సీఈఓ జగదీష్ పటేల్‌తో చర్చించారు. తదుపరి వినతి పత్రాన్ని అందించారు. పోర్టు వద్ద ఎమ్మెల్యే సోమిరెడ్డి మీడియాతో మాట్లాడారు. కంటైనర్ టెర్మినల్ పునరుద్ధరణకు సంబంధించి కృష్ణపట్నం పోర్టు సీఈఓ జగదీష్ పటేల్‌తో చర్చలు జరిపామన్నారు. ఎగుమతులు, దిగుమతులను కాటుపల్లి, ఎన్నూరులకు మార్చి కాలుష్యం వెదజల్లే బొగ్గు, బూడిదను మా ప్రజలపై రుద్దుతారా.. అని పోర్టు యాజమాన్యాన్ని ప్రశ్నించినట్లు ఎమ్మెల్యే మీడియాతో చెప్పారు. రైతులు పండించే బియ్యం, పత్తి, పొగాకు, ఎండుమిర్చితో పాటు చేపలు, రొయ్యలు గతంలో కృష్ణపట్నం పోర్టుకు ఒక్కరోజులోనే చేరి అవకాశం ఉండేదని, ప్రస్తుతం కాటుపల్లి, ఎన్నూరులలో వారం రోజులు ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడటంతో పాటు పెరిగిన రవాణా ఖర్చుల భారం కూడా రైతులపైనే పడుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కంటైనర్ టెర్మినల్ తరలిపోయిన కారణంగా రైతు బిడ్డలు నష్టపోతున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కృష్ణపట్నంపోర్టు కోసం 6వేల ఎకరాలు, కృష్ణపట్నం ఎస్ఈజెడ్ కోసం 8 వేల ఎకరాలు, రిలయన్స్ ప్రాజెక్ట్ -మిగతా 2లో

## ఇసుకని ఉచితంగా తీసుకెళ్లవచ్చు




- ప్రజల కోసం నెల్లూరుసిటీలో మరో నాలుగు రీచ్‌లు ఓపెన్ చేస్తాం
- రీచ్‌ల వద్ద సీసీ కెమెరాలతో మానటరింగ్
- రీచ్‌ల్లో మిషన్లు పెడితే సీజ్ చేస్తాం
- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ
- పలు ఇసుక రీచ్‌లను అధికారులతో కలిసి తనిఖీ చేసిన మంత్రి

2లో

ప్రజల సంపదను

## ప్రైవేటుపరం చేస్తున్నాడు

మాజీ మంత్రి కాకాణి వెల్లడి



లోపల పేజీలో

## అనుకున్నదొకటి..అయినదొకటి..

# బోల్తా కొట్టిన అధికారుల చర్య



**స్థానికుల నుంచి తీవ్ర వ్యతిరేకత - తహసిల్దార్ కార్యాలయం ముట్టడి**

**విడవలూరు/బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :**

అధికారులు ఒకటి తలస్తే.. ప్రజలు మరొకటి తలచినట్లుగా బుచ్చిరెడ్డిపాలెంలో సోమవారం ఓ సంఘటన వెలుగు చూసింది. వివరాల్లోకెళితే.. 1993లో సంగం మండలం తరుణవాయి గ్రామం నుంచి కొందరు పందుల పెంపకం దారులు బుచ్చిరెడ్డిపాలెంకి వలస వచ్చారు. అప్పటి నుంచి వారు బుచ్చిరెడ్డిపాలెంలోని ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకొని నివాస గృహాలను ఏర్పాటు చేసుకున్నారు. అయితే వలస వచ్చిన వీరు నుంచి స్థానిక ప్రజలకు ఇబ్బందులు వస్తున్నాయని ప్రజల నుంచి నగర పంచాయతీ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డికి అనేక ఫిర్యాదులు వచ్చాయి. దీనికి స్పందించిన ఆయన కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సహకారంతో దాదాపు 31 ఏళ్ల తర్వాత ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకున్న పందుల పెంపకందారులను అక్కడి నుంచి తరలించారు.

**పెనం మీద నుంచి పొయ్యిలో పడి..**

నగర పంచాయతీ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి మంచి ఆలోచనతో -మిగతా 6లో

నియోజకవర్గాన్ని అగ్రగామిగా..

# నిలపడమే లక్ష్యం

- నడికుడి-శ్రీకాళహస్తి రైల్వేలైను పూర్తి చేస్తాం
- రోడ్ల మరమ్మత్తులకు నిధుల మంజూరు
- ప్రతి అర్జీకి జవాబు దారీతనం ఉంటుంది
- ఆలయ పునర్నిర్మాణానికి రూ.8.40 కోట్లు మంజూరు
- సూపర్ సిక్స్ అమలే.. ప్రభుత్వ ధ్యేయం
- రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం



**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి పదంలో నిలపడమే తన ముందు ఉన్న ప్రధాన లక్ష్యమని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. సోమవారం అనంతసాగరంలో ప్రజా విజ్ఞప్తుల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. తొలుత సోమశిలకు విచ్చేసిన మంత్రి సోమేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త ఉప్పల విజయ్‌కుమార్, వేద పండితులు మంత్రికి -మిగతా 2లో

# నియోజకవర్గాన్ని అగ్రగామిగా నిలపడమే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

మంత్రోచ్చారణతో ఘన స్వాగతం పలికారు. సోమశిల లో 15 లక్షలతో ఉపాధి హామీ నిధులతో నిర్మించనున్న సిమెంటు రోడ్డు నిర్మాణానికి మంత్రి భూమి పూజ చేశారు. అనంతరం అనంతసాగరంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు.

**ప్రజా వేదికకు భారీ ఏర్పాట్లు**

అనంత సాగరంలోని తహసిల్దార్ కార్యాలయం వద్ద ప్రజా విజ్ఞప్తుల పరిష్కార వేదిక కార్యక్రమానికి టిడిపి నాయకులు, అధికారులు భారీ ఏర్పాట్లు చేశారు. కార్యక్రమానికి ముందుగా మంత్రి ఆనం మొక్కలు నాటారు. మండలంలోని 25 గ్రామపంచాయతీలకు సంబంధించి అర్జీల స్వీకరణకు ఒక్కొక్క కౌంటర్లు ఏర్పాటు చేయడం జరిగింది. వివిధ రకాల సమస్యల అర్జీలను ఆన్లైన్లో సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు నమోదు చేశారు. ప్రజా వేదిక కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఏళ్ల తరబడి పరిష్కారం కాకుండా ఉన్న పలు రెవెన్యూ, ఇతర సమస్యల అర్జీదారులు కార్యక్రమాన్ని సద్వియోగం చేసుకున్నారు. పలు సమస్యలపై 1246 అర్జీలు అందగా అందులో 662 అర్జీలు రెవెన్యూ పరిష్కారానికి సంబంధించినవి.

**ప్రతి అర్జీకి జవాబుదారీతనం ఉంటుంది**

ఈ సందర్భంగా మంత్రి ఆనం కొన్ని అర్జీలను స్వీకరించి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో తొలిసారిగా ప్రజా సమస్యలపై ఓ ప్రత్యేక పరిష్కార వేదికను ఏర్పాటు చేయడం తనకు సంతోషంగా ఉంది అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కార్యక్ర



మాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామని అర్జీల స్వీకరణ కాదు వాటి సత్వర పరిష్కరణ కూడా తప్పకుండా ఉంటుందన్నారు. ఆయా సమస్యలపై అందిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులు సత్వరమే పరిశీలించి 15 రోజుల్లోగా పరిష్కరణ జరిగేలా చూడాలని ఆదేశించారు. ప్రజా సంక్షేమం రాష్ట్ర అభివృద్ధి ప్రధాన లక్ష్యంగా కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి అన్నది ఆమడ దూరంలోనే ఉండేదని మంత్రి ఎద్దేవా చేశారు.

**అభివృద్ధి పనులు ఇక జోరందుకుంటాయి**

గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పనులకు నిధులు లేవంటూ వైసిపి కుంటి సాకులు చెప్పిందన్నారు. అయితే కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి జరిగేలా ప్రత్యేక ప్రణాళికలు కార్యాచరణ చేపట్టింది అన్నారు. గత వరదలకు దెబ్బతిన్న సోమేశ్వర ఆలయ పూర్వ వైభవానికి 8.40 కోట్ల రూపాయలు మంజూరు అయినట్లు మంత్రి తెలిపారు. నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే లైను, జాతీయ రహదారుల ఏర్పాటు,రాష్ట్రంలో మెరుగైన నూతన రహదారులు, మరమ్మత్తు పనులు ప్రభుత్వం వేగవంతం చేస్తుందని తెలిపారు. రైల్వే లైన్ను నెల్లూరుకు అనుసంధానం చేసేలా ప్రతిపాదనలు చేస్తున్నట్లు ఆయన అన్నారు. నియోజకవర్గంలోని దెబ్బతిని ఉన్న ప్రతి రహదారికి యుద్ధ ప్రాతిపదికన మరమ్మత్తు పనులు జరుగుతాయన్నారు. అనంత సాగరం మండలంలో ఒకటిన్నర కోటి రూపాయలు ఉపాధి హామీ క్రింద నిధులు మంజూరయ్యాయని వీటితో సిమెంటు రోడ్లను నిర్మించనున్నట్లు ఆయన తెలిపారు.

**చేసిన హామీలను నెరవేర్చి నిలబెట్టుకుంటాం**

ఎన్నికల్లో తమ కూటమి పార్టీ చేసిన ప్రతి హామీని ముఖ్యం గా సూపర్ సిక్స్ను తప్పక అమలు జరిగేలా తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. దీపావళి నుండి ఆడపడుచులకు మహాశక్తి స్కీం ద్వారా ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర ఆదాయాన్ని బడ్జెట్ను దృష్టిలో ఉంచుకొని ప్రణాళికాబద్ధంగా ప్రాధాన్యత క్రమంలో ఒక్కొక్క హామీని తమ ప్రభుత్వం నెరవేరుస్తూ ముందుకు వెళుతుందని అందులో ఎటువంటి సందేహం లేదని తెలిపారు. అనంతసాగరం మండలంతో తమ ఆనం కుటుంబానికి ప్రత్యేక అనుబంధం ఉందని మంత్రి గుర్తు చేసుకున్నారు. తన గెలుపులో మండల నాయకులు చేసిన నిర్విరామ కృషిని మరువలేనని అన్నారు. మండలంలో గత ప్రభుత్వ ఆయాంలో ఎక్కడ అభివృద్ధి అన్నది కాన రాలేదని ఇకనుంచి ఆ పరిస్థితులు ఉండమన్నారు. మండల అభివృద్ధికి ఎంపీటీసీలు సర్పంచులు నాయకులు ప్రతి కార్యకర్త సైతం కలిసి రావాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. అభివృద్ధి పనుల విషయంలో ప్రకటించిన నిధుల కంటే అవసరతలను బట్టి వాటి పెంపు ఉంటుందని అందుకు తనవంతు కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. ప్రజలు అందించిన సమస్యల అర్జీల పరిష్కరణలో అధికారులు నిర్లక్ష్యం వహించరాదని తెలిపారు. కార్యక్రమాన్ని ఎంతో గొప్పగా ఏర్పాటు చేసేందుకు గత కొన్ని రోజులుగా శ్రమిస్తూ వచ్చిన నాయకులను, అధికారులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షురాలు మునగపాటి సునీత, సీనియర్ నాయకులు మెట్టుకూరు ధనుంజయ రెడ్డి, మెట్టుకూరు కృష్ణారెడ్డి, ఆత్మకూరు ఆర్డీవో పావని, ఎంపీడీవో ఐజాక్ ప్రవీణ్, తాసిల్దార్ సుధీర్, బొల్లినేని గిరినాయుడు, జిల్లా మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## అదానీలకు దండం పెట్టి అడుగుతున్నాం..

# కంటైనర్ టెర్మినల్ పునరుద్ధరించండి

(మొదటి పేజీ తరువాయి)

కోసం 2600 ఎకరాలు, కిసాన్ సెజ్ కోసం 2300 ఎకరాలను రైతులు త్యాగం చేశారనిసాక్షాత్తు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గత నెల 6న క్రిస్ సిటీకి శంకుస్థాపన చేయాల్సి ఉంది. కానీ, వర్షాల కారణంగా వాయిదా పడిందని సోమిరెడ్డి పేర్కొన్నారు. 2600 ఎకరాలతో ఏర్పాటు కాబోతున్న క్రిస్ సిటీ (కృష్ణపట్నం ఇండస్ట్రియల్ నోడ్) కూడా పోర్టు, కంటైనర్ టెర్మినల్ ఆధారంగానే ఈ ప్రాంతానికి మంజూరైనట్లు ఆయన పేర్కొన్నారు. క్రిస్ సిటీతో వస్తున్న ప్రధాన మంత్రికి కొత్త పరిశ్రమలతో స్వాగతం పలకాల్సిందిపోయి కంటైనర్ టెర్మినల్ మూసేశామని అదానీ చెబుతారా.. అంటూ ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. కంటైనర్ టెర్మినల్ ఇక్కడి నుంచి తరలిపోవడంతో వృత్తి నిపుణులు, పట్టభద్రుల నుంచి లారీ డ్రైవర్ల వరకు 10 వేల మంది ఉద్యోగాలు కోల్పోవలసి వచ్చింది అన్నారు. తాతముత్తాలు ఇచ్చిన భూములు, గ్రామాలను ఈ ప్రాంత రైతులు కృష్ణపట్నం పోర్టు ఏర్పాటు కోసం త్యాగం చేస్తే కంటైనర్ టెర్మినల్ మూసేసి వారి పొట్టకొడుతారా అంటూ ఆయన నిలదీశారు. ప్రజలు, రైతులు, రైతు బిడ్డల ప్రయోజనాల కోసం కంటైనర్ టెర్మినల్ పునరుద్ధరించమని అదానీ కాళ్లు పట్టుకునేందుకైనా సిద్ధం.. లేదంటే పోరాటానికైనా వెనుకాడమని ఎమ్మెల్యే హెచ్చరించారు. పోరాటాలు కొత్త కాదు. గతంలో అఖిలపక్షంతో కలిసి సారా వ్యతిరేక ఉద్యమం చేశాం.. థర్మల్ పవర్ ప్రాజెక్టులకు వ్యతిరేకంగా పోరాటాలు చేసామని సోమిరెడ్డి గుర్తు చేశారు. పోర్టు సీఈఓ 20 రోజులు సమయం అడిగారని నెలరోజుల వరకు ఆగుతామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. 20 రోజుల సమయం ఇస్తే అవసరమైన చర్యలు తీసుకుంటామని జగదీష్ పటేల్ హామీ ఇచ్చారు. ఎన్విరాన్మెంట్ క్లియరెన్స్ ప్రకారం కృష్ణపట్నం పోర్టు మొదటి ఫేస్లో 4, సెకండ్ ఫేస్లో 3 బెర్తులను కంటైనర్ టెర్మినల్కే వాడాలి.. మిగిలినవి బల్క్ కార్గోకి వినియోగించాలన్నారు. కంటైనర్ టెర్మినల్ను మూసేసి ఆ బెర్తులను కూడా బల్క్ కార్గోకు వినియోగించుకోవడం ఎంతవరకు న్యాయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నేత కర్నాటి ఆంజనేయరెడ్డి, సంపత్ కుమార్, సర్వేపల్లి నియోజకవర్గ జనసేన ఇన్చార్జి బొబ్బేపల్లి సురేష్ నాయుడు, సీఐటీయూ నేత మోహన్ రావు, సీపీఐ నాయకుడు శంకర్ కిషోర్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## నిర్దేశించిన ప్రదేశాల్లో మాత్రమే

# బాణాసంచా విక్రయాలు జరపాలి



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్న్యూస్ :** అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉన్నందున నెల్లూరు నగర పాలక సంస్థ నిర్దేశించిన ప్రదేశాల్లో మాత్రమే బాణాసంచా విక్రయాలను జరపాలని కమిషనర్ సూర్యతేజ సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. జన సమూహం ఉన్న ప్రదేశాల్లో బాణాసంచా దుకాణాలను ఏర్పాటు చేసి విక్రయాలు జరిపితే కఠిన చర్యలు తీసుకొని, దుకాణాలను తొలగిస్తామని కమిషనర్ హెచ్చరించారు. కింద సూచించిన ఆయా ప్రదేశాల్లో మాత్రమే బాణాసంచా విక్రయాలు జరపాలని కమిషనర్ స్పష్టం చేశారు. వీఆర్ కళాశాల మైదానం, వైఎంసీఏ మైదానం, సర్వోదయ కళాశాల మైదానం, ఆర్ఎస్ఆర్ హైస్కూల్ మైదానం, ఎస్వీజీఎస్ కళాశాల మైదానాలలో మాత్రమే బాణాసంచా విక్రయదారులు తమ దుకాణాలను ఏర్పాటు చేసుకొని విక్రయించాలని స్పష్టం చేశారు. నగరపాలక సంస్థ సూచించిన అన్ని రక్షణా చర్యలను, నిబంధనలను ఆయా దుకాణాల్లో తప్పనిసరిగా పాటించాలని కమిషనర్ సూచించారు. అతిక్రమించిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు.

# అర్జీలు వేగవంతంగా పరిష్కరించాలి

(మొదటి పేజీ తరువాయి)

కార్యక్రమానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతరిస్తుందన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కార్యక్రమలో వచ్చిన అర్జీలను అధికారులు నిర్దేశిత గడువులోగా పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుండి, ప్రజా ప్రతినిధుల నుండి వచ్చిన అర్జీలపై సత్వరమే చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. అర్జీ దారులను పదేపదే కార్యాలయం చుట్టూ తిప్పు కోకుండా సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు. పరిష్కరించలేని సమస్యలను అర్జీలకు రాతపూర్వకంగా ఎండార్స్మెంట్ రూపంలో తెలియజేయాలని ఆయన చెప్పారు. నేడు జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వివిధ రకాల సమస్యలపై 302 అర్జీలు వచ్చాయని జిల్లా కలెక్టర్ తెలియజేశారు. ఈ సందర్భంగా నెల్లూరు నగరం సంతపేటకు చెందిన కారణి వెంకటేశ్వర్లు వికలాంగుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి ట్రై సైకిల్ కావలసిందిగా కోరుతూ, గతంలో అర్జీ ఇచ్చి ఉన్నారని ఈ విషయమై కలెక్టర్ స్పందిస్తూ కరణి వెంకటేశ్వర్లకు 50 వేల రూపాయలు విలువగల ట్రై సైకిల్ను కలెక్టరేట్లో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీపీఓ శ్రీధర్రెడ్డి, జెడ్పీ సీఇఓ జె.మోహన్రావు, నెల్లూరు రెవెన్యూ డివిజనల్ అధికారి అనూష, విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ విజయ్కుమార్, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ రవీంద్ర, డ్వామా అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ కనకదుర్గ భవాని, వికలాంగుల సంక్షేమ శాఖ ఏడి వినయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# ఇసుకని ఉచితంగా తీసుకెళ్లవచ్చు : మంత్రి నారాయణ




**నెల్లూరు, మేజర్న్యూస్ :** రాష్ట్రాభివృద్ధి కోసం సీఎం చంద్రబాబు ఉచిత ఇసుక పాలసీ విధానాన్ని తీసుకువచ్చారని ప్రజలందరూ ఇసుకని ఉచితంగా తీసుకెళ్లవచ్చని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. నెల్లూరు సిటీ పరిధిలోని భగత్ సింగ్ కాలనీ, బోడిగాడితోట, గాంధీ గిరిజన కాలనీ, పొర్లుకట్ట పలు ప్రాంతాల ఇసుక రీచులను అధికారులు, టీడీపీ నాయకులతో కలిసి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇసుక రీచ్ల పరిస్థితిని అధికారుల్ని ఆయన అడిగి తెలుసుకున్నారు. ఎక్కడా ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రజలకి ఇసుకను అందించాలని మంత్రి అధికారుల్ని ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ఫస్ట్ రియల్ ఎస్టేట్ కన్స్ట్రషన్స్ డెవలప్ కావాలన్నదే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముఖ్య ఉద్దేశమన్నారు. అందుకనే ఎవరూ ఇబ్బంది పడకూడదనే ఉచిత ఇసుక పాలసీని తీసుకువచ్చారన్నారు. ట్రాక్స్లు తీసేసి ఎవరైనా ఎడ్ల బండ్లపై ఇసుకను ఉచితంగా తీసుకెళ్లవచ్చని ప్రభుత్వం స్పష్టం చేసిందన్నారు. నెల్లూరు సిటీ పరిధిలో మైన్స్, రెవెన్యూ, కార్పొరేషన్ అధికారులు సుమారు నాలుగు ఇసుక రీచ్లను ఏర్పాటు చేశారని తెలిపారు. దీనివల్ల ట్రాక్టర్ ఇసుక రూ.4వేల నుంచి 5వేలు ఉంటే ఒక్కసారిగా రూ.2వేల నుంచి 1500లోపే పడిపోయిందన్నారు. దగ్గరగా ఉంటే రూ.1500లు, దూరంగా ఉంటే రూ.2 వేలలోపు ఖర్చవుతుందన్నారు. దీంతో ప్రజలు ఇసుకని ఎంతో ఫ్రీగా, స్వేచ్ఛగా తీసుకెళుతున్నారన్నారు. మరో 4 రీచ్లను ఓపెన్ చేయాలని ఇప్పటికే కలెక్టర్, కమిషనర్లకు తెలియజేయడం జరిగిందన్నారు. మొత్తం మీద ఇసుక రేటు రూ.1200లకు రావాలన్న ఆలోచనతోనే ప్రజలకి దగ్గర ఏరియాలో రీచ్లను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. నెల్లూరు సిటీలో ఎక్కువ రీచ్ల ఓపెన్ చేయడం వల్ల రద్దీ తగ్గుతుందన్నారు.

ముఖ్యంగా రీచ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వాటి మానటరింగ్ కలెక్టర్, ఎస్పీ, కార్పొరేషన్ కార్యాలయాలకు ఇవ్వాలని ఇప్పటికే అధికారుల్ని ఆదేశించడం జరిగిందన్నారు. రీచ్లలో మిషన్లు పెట్టకూడదని.. పొరపాటున పెడితే వాటిని పోలీసులు సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని మంత్రి హెచ్చరించారు.

# బాధితురాలి కుటుబానికి పరామర్శ : శేషం సుదర్శన్



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లా అనంతసాగరం మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన ఇంటర్ చదివే ఓ యువతి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన పై జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యులు శేషం సుదర్శన్, డాక్టర్ అంబేద్కర్ సేన వ్యవస్థాపక అధ్యక్షులు కొప్పాల రఘు బాధితురాలి కుటుంబాన్ని ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలలో పరామర్శించారు. ఈ సందర్భంగా భాదితులు తెలిపిన వివరాల మేరకు అనంతసాగరం మండలం లింగంగుంట గ్రామానికి చెందిన ఓ వివాహితుడు మైనర్ బాలికతో కొంతకాలం సన్నిహితంగా ఉండి పెళ్లి చేసుకుంటానని నమ్మించి మాయ మాటలతో చెప్పి శారీరకంగా లొంగదీసుకున్నాడని తాను పిలిచిన చోటుకి రాకపోతే బాలికపై లైంగిక దాడి చేసిన సమయంలో తీసిన ఫోటోలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో పెడతానని బెదిరించడంతోపాటు బాలిక చదువుతున్న కళాశాల యాజమాన్యానికి కూడా ఆ వీడియోలు పంపడంతో ఆ బాలిక మనస్తాపానికి గురై నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని కుటుంబ సభ్యులు వివరించారు. ఘటన జరిగిన వెంటనే పోలీసు వ్యవస్థ నిందితుడిని అరెస్టు చేయడం పట్ల ఆత్మకూరు డీఎస్పీ, సీఐ గంగాధర్, ఎస్ఐ, సిబ్బందికి అభినందనలు తెలిపారు. అనంతరం బాలిక కుటుంబానికి, బాధితురాలికి ప్రభుత్వం పరంగా రావలసిన సదుపాయాలు, బాలిక చదువుకి సంబంధించిన అంశాల గురించి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళి బాలిక కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు.

# వెలుగొండపై ప్రభుత్వానికి నిర్లక్ష్యం తగదు



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మెట్ట ప్రాంతాలకు జీవనాడిలాంటి వెలుగొండ ప్రాజెక్టు ప్రభుత్వాల నిర్లక్ష్యానికి గురై పనులు మందకొడిగా సాగుతున్నాయని వెల గొండ సాధన సమితి అధ్యక్షుడు డాక్టర్ శ్యాంప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇటీవల వెలుగొండ సాధన సమితి ఆధ్వర్యంలో కడప, నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు చెందిన నాయకులతో వెలుగొండ ప్రాజెక్టు సొరంగ నిర్మాణ పనులను పరిశీలించడం జరిగిందన్నారు. రాష్ట్రంలో అత్యంత వెనుకబడి ప్రాంతాలుగా ఉదయగిరి, కనిగిరి, మార్కాపురం, దర్శి, పొదిలి ఉన్నాయన్నారు. ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి శూన్యమని, సాగు, తాగునీరు లేక ప్రజలు పొట్టచేతపట్టుకొని వలసబాట పడుతున్నారన్నారు. ఆయా ప్రాంతాలకు జీవనాడిలాంటి వెలుగొండ ప్రాజెక్టు పాలకులు, అధికారుల నిర్లక్ష్యానికి గురవుతుందన్నారు. ఇప్పటికైనాప్రభుత్వం శ్రద్ధచూపి రానున్న బడ్జెట్లో వెలుగొండకు నిధులు కేటాయించి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. వెలుగొండ ప్రాజెక్టు పూర్తయితే ఈ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సాధన సమితి నాయకులు దస్తగిరిఅహమ్మద్, కాకు వెంకటయ్య, కాకు విజయ మ్మ, సుజాత, ఫడ్స్ రమణయ్య, మస్తాన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సభ్యత్వ నమోదును ..

# విజయవంతం చేయాలి

మంత్రి నారాయణ వెల్లడి



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమంను విజయవంతం చేయాలని మంత్రి నారాయణ తెలిపారు. సోమవారం నెల్లూరు నగరంలోని వార్డు ఇంచార్జులు, అధ్యక్షులు, కార్యదర్శులు, బూత్ కన్వీనర్లతో నారాయణ మెడికల్ కళాశాలలోని క్యాంప్ కార్యాలయంలో మున్సిపల్ శాఖామాత్యులు పొంగూరు నారాయణ నిర్వహించిన సమావేశంలో నెల్లూరు పార్లమెంట్ అధ్యక్షులు షేక్ అబ్దుల్ అజీజ్, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, తాళ్ళపాక అనురాధ, విజేత, మావిడాల మధులతో కలిసి పాల్గొన్న టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయన పార్టీ సభ్యత్వ నమోదు వలన చేకూరే ప్రయోజనాలను పార్టీ కార్యకర్తలకు, సానుభూతి పరులకు వివరించాలని రికార్డు స్థాయిలో సభ్యత్వ నమోదు చేయించాలని నగర టీడీపీ నేతలకు ఆయన పిలుపు ఇచ్చారు.

# స్కూల్ గ్రాంట్స్ నిధులతో పాఠశాలను అభివృద్ధి పరచండి

**నెల్లూరు (విద్య), మేజర్‌న్యూస్ :** ప్రాథమిక, మాధ్యమిక, సీనియర్ సెకండరీ పాఠశాలలకు 2024-25 కాంపోజిట్ స్కూల్ గ్రాండ్స్ కింద జిల్లాకు ఆరు కోట్ల నిధులు కేటాయించడం జరిగిందని రాష్ట్ర సమగ్ర శిక్ష ప్రాజెక్టు కోఆర్డినేటర్ శ్రీనివాసరావు ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని కస్తూర్బా బాలిక విద్యాలయాలు, జూనియర్ కళాశాలలు, పీఎం శ్రీస్కూల్స్‌లు కలిపి ఈ గ్రాంటును కేటాయించడం జరిగిందని తొలి విడుదల 50శాతం నిధులు విడుదల చేసినట్లు ఆయన తెలిపారు. గత ప్రభుత్వంలో నాడు-నేడు కింద చేసిన పనులు నాణ్యత లోపాల వలన పలుచోట్ల దురదృష్టకరణ సంఘటన చోటు చేసుకున్న విషయం విధితమే. కావున తల్లిదండ్రులు అటువంటి దురదృష్టకర సంఘటన మరలా చోటు చేసుకోకుండా ఆ నిధులను పాఠశాల కళాశాలల అభివృద్ధికి కేటాయిస్తే బాగుంటుందని అభిప్రాయపడుతున్నారు. ఇటీవల ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా కమిటీలు ఏర్పాటు అయిన విషయం విదితమే. ఈ నిధులను వారి ద్వారా అభివృద్ధి పనులు చేయిస్తే పనులు నాణ్యతతో జరుగుతాయని అభిప్రాయం వ్యక్త పరుస్తున్నారు.

## నేడు గంధమహోత్సవం

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** పట్టణంలోని కోనకాలువ సమీపంలో ఉన్న శ్రీశ్రీశ్రీ హజరత్ సయ దినా మహబూబ్ సుభానీ గంధమహోత్సవం మంగళవారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాత్రికి హక్కుదారుల ఇంటి నుంచి గంధం మేళతాళాలు, పకీరు జరుబులు, బాణసంచా పేలుళ్ల నడుమ ఊరేగింపుగా బయలుదేరి దర్గా చేరుతుందన్నారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం గంధాన్ని భక్తులకు పంచిపెడతారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశామని, హిందూ. ముస్లిం భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

## రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థి ఎంపిక

**బోగోలు, మేజర్‌న్యూస్ :** బోగోలు మండలం జువ్వలదిన్నె గ్రామం లోని ఉన్న ప్రభుత్వ జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న కె.నీలవేణి రాష్ట్ర స్థయి కబడ్డీ పోటీలలో ఎంపిక అయిందని పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు కే.శివ జ్యోతి సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు శివ జ్యోతి మాట్లాడుతూ.. అన్నమయ్య జిల్లా, రాయచోటి గ్రామంలో అక్టోబర్ 27 తారీకు నుండి 29వ తేదీ వరకు జరుగు అండర్ 17 విభాగంలో జరుగు రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలలో పదో తరగతి చదువుతున్న కె.నీలవేణి పాల్గొంటున్నారని తెలిపారు. విద్యార్థికి రాష్ట్రస్థాయి పోటీకి శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు ఎస్.కె ఖాదర్ హుస్సేన్‌కు ఈ సందర్భంగా పాఠశాల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు.

## షెడ్ నిర్మాణానికి స్థల పరిశీలన

**బోగోలు, మేజర్‌న్యూస్ :** బిట్రగుంట రైల్వే స్టేషన్ సమీపంలో రొటీన్ ఓవర్ హాలింగ్ (ఆర్‌ఓహెచ్) ఏర్పాటుకు అధికారులు స్థల పరిశీలన సోమవారం చేశారు. గూడ్స్ వ్యాగన్ రిపేర్లు వాటి పనితీరు మెరుగుపరిచే ఆర్‌ఓహెచ్ షెడ్ నిర్మాణానికి రైల్వే అధికారులు కార్యరూపం దాల్చేందుకు ప్రణాళికలు వేస్తున్నారు. అందుకు అవసరమైన భూసేకరణ చేసేందుకు బిట్రగుంట్ల లోని రైల్వే స్థలాన్ని పరిశీలించారు.

## అక్రమ మైనింగ్ కేసులో వైసీపీ నేత అరెస్టు



**రాపూరు, మేజర్‌న్యూస్ :** రాపూరు పులిగిల పాడు సమీపంలోని ఎస్ఎల్‌వీ స్టోన్ క్రషర్ యజమాని, వైసీపీ నాయకులు వైవి రామిరెడ్డిని సోమవారం అక్రమ మైనింగ్ కేసులో పోలీసులు అరెస్టు చేశారు. ప్రభుత్వ భూముల్లో అక్రమ మైనింగ్ చేసినట్లు గుర్తించిన రాపూరు తహసీల్దార్ లక్ష్మి నరసింహం ఫిర్యాదు మేరకు 427,379 సెక్షన్ల కింద ఈనెల 22న కేసు నమోదు చేసిన రాపూరు పోలీసులు సోమవారం నెల్లూరులో అరెస్టు చేసి రాపూరు పోలీస్ స్టేషన్‌కి తరలించారు. ఆనంతరం కోర్ట్‌కి హాజరు పరిచినట్లు రాపూరు ఎస్ఐ వెంకట రాజేష్ తెలిపారు. సుమారు వంద కోట్ల జరిమానా మైనింగ్ అధికారులు విధించినట్లు తెలుస్తోంది. జరిమానా కట్టక పోవడంతో చర్యలకు ఉపక్రమించింది ప్రభుత్వం అని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. ఈ అరెస్టుతో మిగిలిన క్రషర్ యజమానులు ఆందోళన చెందుతున్నారు.

## గురవయ్యశాల గ్రామంలో అన్నదానం



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని బ్రహ్మదేవి గ్రామపంచాయతీ గురవయ్య సాల గ్రామంలో సోమవారం అన్నదాన కార్యక్రమం జరిగింది. మహాలక్ష్మమ్మ ఆలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమానికి ఉభయ కర్తలుగా బొబ్బేపల్లి అంకయ్య వ్యవహరించారు. దసరా పండుగ సందర్భంలో శరన్నవరాత్రి ఉత్సవాలు చేసి 16 రోజులు పూర్తి అయిన సందర్భంగా ఈ కార్యక్రమాన్ని జరిపారు. తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ గౌరవ అధ్యక్షులు కొత్తపల్లి రమేష్ కుమార్ శర్మ, శ్రీనివాసులు, వెంకట రమణయ్య, హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్తుల సమక్షంలో అన్నదానం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఏఓ శైలజకి గాయాలు



**జలదంకి, మేజర్‌న్యూస్ :** జలదంకి మండల వ్యవసాయ అధికారి శైలజకు రోడ్డు ప్రమాదంలో గాయాలు అయ్యాయి. సోమవారం విధులలో భాగంగా చామదుల వెళుతుండగా తొమ్మిదో మైలు సమీపంలో ఆమె కారు అదుపుతప్పి గోడను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆమెకి గాయాలు కాగా వెంటనే హుటాహుటిన కావలి వైద్యశాలకు తరలించారు. ఆమె ఒక ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు.

# ఉచిత స్క్రీనింగ్ టెస్టును సద్వినియోగం చేసుకోండి

- క్యాన్సర్ రహిత కోవూరే ఎమ్మెల్యే లక్ష్యం
- విడవలూరులో ప్రారంభమైన స్క్రీనింగ్ టెస్టులు



**విడవలూరు, మేజర్‌న్యూస్ :** కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మంచి మనసుతో చేపట్టిన ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్ట్‌లను మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ నాయకులు కోరారు. ఈ మేరకు మండల కేంద్రమైన విడవలూరు లోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు సోమవారం నుంచి పింక్ బస్సు సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్యాన్సర్ రహిత కోవూరు లక్ష్యంగా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి విపిఆర్ ఫౌండేషన్ ద్వారా చేపట్టిన ఈ బహుత్తర కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తుందని తెలిపారు. కోవూరులో ఏ ఒక్కరు క్యాన్సర్‌తో బాధపడకూడదు అన్న మంచి ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని మండలంలోని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముఖ్యంగా 35 సంవత్సరాలు పైబడిన మహిళలు ఉచితంగా లభించే ఈ సేవలను సద్వినియోగం చేసుకొని ప్రాథమిక దశలోనే క్యాన్సర్ లక్షణాలను గుర్తించేందుకు మంచి అవకాశం అన్నారు. దాదాపు 25 వేలు ఖర్చుతో కూడిన ఈ పరీక్షలను ఎమ్మెల్యే సహకారంతో ఉచితంగా చేయడం అభినందనీయమన్నారు. అనంతరం స్థానికంగా నూతనంగా నిర్మించిన వైద్యశాల అదనపు భవనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ఇన్‌చార్జ్ శ్రీధర్ రెడ్డి, నాయకులు సత్యం రెడ్డి, శ్రీహరి రెడ్డి, వంశీకృష్ణారెడ్డి, చైతన్య, శ్రీనివాసులు, గోవర్ధన్ రెడ్డి, వైద్యులు పాల్గొన్నారు.

# 46వ డివిజన్‌లో సమస్యలపై అదనపు కమిషనర్‌కు వినతి



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో 46వ డివిజన్ కార్పొరేటర్ వేలూరు ఉమా మహేష్ సోమవారం హాజరై తన డివిజన్ పరిధిలోని సమస్యలను అదనపు కమిషనర్ నందన్‌కు తెలియజేస్తూ మెమెరాండం సమర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 46వ డివిజన్ పరిధిలోని దేవిశెట్టి వారి వీధిలో రోడ్లన్నీ దెబ్బతిని అధ్వానంగా తయారయ్యాయని, ఆయా ప్రాంతలలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సైడ్ కాలువలు, సీసీ రోడ్ నిర్మాణ పనులు ఎంత అవసరమని, అదేవిధంగా బాబు ఐస్ క్రీమ్ ఎదురువీధిలో కొత్తగా సిసి రోడ్ నిర్మించినప్పటికీ.. కాలువలు నిర్మాణం చేయకపోవడంతో వర్షాకాలంలో ఆ ప్రాంతంలో చాలా ఇబ్బందులు తలెత్తుతున్నాయని తెలియజేశారు. వెంటనే కాలువ నిర్మాణానికి చర్యలు తీసుకొని ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా నిర్మాణ పనులు ప్రారంభించాలని, లేనిపక్షంలో కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశాల్లో ప్రశ్నించడమే కాకుండా ప్రజలతో కలిసి ఉద్యమిస్తామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.

# మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- కనీససౌకర్యాలు కల్పించాలి
- సమ్మెకాలంలో ఇచ్చిన హామీలు అమలుచేయాలి




**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** మున్సిపల్ కార్మికుల సమస్యలు సత్వరమే పరిష్కరించాలని, కనీససౌకర్యాలు కల్పించాలని, గత సమ్మె సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని సిఐటి నాయకులు, సిఐటియు అనుబంధ ఏపి మున్సిపల్ వర్కర్స్‌అండ్ ఎంప్లాయిూస్ యూనియన్ నాయకులు కోరారు. సమస్యల పరిష్కారం, న్యాయమైన కోర్కెల సాధనకోసం సోమవారం మున్సిపల్ వర్కర్స్‌అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ధర్నా నిర్వహించగా యూనియన్ నాయకులతోపాటు సిఐటియు తదితర సంఘాల నాయకులు కూడా పాల్గొన్నారు. కార్యాలయం ఎదుట వారు ధర్నా చేసి నినాదాలతో హోరెత్తించారు. తమ సమస్యలు పరిష్కరించాలని వారంతా గొంతెత్తి ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. ఈసందర్భంగా నాయకులు ప్రసంగిస్తూ పట్టణాల విస్తరణ దామాషాలో సిబ్బందిసంఖ్యను పెంచాలని, ఇంజనీరింగ్, పారిశుధ్య, ఎన్‌ఎంఆర్, కోవిడ్, బదిలీ తదితర సిబ్బంది,కార్మికులకు చట్టబద్ధమైన వారాంతపుసెలవులు, క్యాజువల్, జాతీయ సెలవులు పక్కాగా అమలు చేయాలని, పనిముట్లు, రక్షణపరికరాలు, భద్రతా సౌకర్యాలు కల్పించాలని, వాహనాలకు మరమ్మత్తులు చేయించాలని, యూనిఫారం, చెప్పులు, సబ్బులు, నూనెలు,టవల్స్‌ను సకాలంలో ఇవ్వాలని వారు కోరారు. ఇపిఎఫ్, ఇఎస్ఐ అములో లోపాలను సరిచేసి నాలుగు ఖాతాలను ఒకే ఖాతాలోకి తేవాలని, మరణించిన కార్మికుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, ఆప్కాస్ ద్వారా రిటైర్మెంట్ అయిన కార్మికుల పిల్లలకు ఉపాధి కల్పించాలని, గతంలో 17రోజుల సమ్మెకాలంలో జీతం, 1000రూపాయల పండుగ కానుక చెల్లించాలని, అప్పట్లో ప్రభుత్వం అంగీకరించి మినిట్స్‌కాపీలో చేర్చిన రిటైర్‌మెంట్ బెనిఫిట్, ప్రమాదమృతులకు ఎక్స్‌గ్రేషియా 5నుండి7లక్షలకు పెంచడం, దహనసంస్కారాలకు ఇచ్చే మొత్తాన్ని 20వేల రూపాయలకు పెంచాలని, విజయవాడలో వరదల్లో విధులు నిర్వహించిన వారికి ఒక నెల బోనస్‌గా ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈమేరకు కమీషనర్ గంగాప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు జి.వి.శివప్రసాద్, లక్ష్మినరసయ్య, మండల సిఐటియు అధ్యక్షుడు ఆత్మకూరు నాగయ్య, ఏపి మున్సిపల్ వర్కర్స్‌అండ్ ఎంప్లాయిూస్ యూనియన్ నాయకులు వి.గురవయ్య, ఎన్.భాస్కర్, కె.రామయ్య, పి.శ్రీనివాసులు, దేవరపాటి చిన్నబాబు, ఎస్.కె.నిజాముద్దీన్, కె.పెంచలయ్య, ఎస్కె ఇమ్రాన్, షేక్ అబ్దుల్లా, జి.శ్రీను, పి.సింహాద్రి, పలువురు కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

## మురుగునీటిని తొలగించండి..



**సైదాపురం, మేజర్‌న్యూస్ :** ఊటుకూరు పంచాయతీ పరిధిలోని సబ్ సెంటర్ వద్ద కొన్ని ఏళ్లపాటు వీధుల్లో నిలిచిపోయినటువంటి మురుగునీరు పంచాయతీ పరిధిలోని అధికారులు పట్టించుకోవట్లేదు అని దానివల్ల చుట్టుపక్కల దోమలు ఎక్కువగా ఉంటున్నాయని అక్కడే నివసిస్తున్న అటువంటి ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. పారిశుద్ధ్య లోపం వల్ల తగు అనారోగ్య సమస్యలు ఏర్పడుతున్నాయని కనీసం పంచాయతీ పరిధిలో బ్లీచింగ్ కూడా వేసే పరిస్థితి లేదు అని అంతేకాకుండా సైడ్ డ్రైనేజ్ కాలువలు లేక నీరు నిలబడుతుందని ఇళ్లల్లో నీళ్లు కూడా బయట పోయే పరిస్థితి లేక ఈదుల్లోకి వదిలేసే పరిస్థితి ఏర్పడిందని ఇకనైనా పంచాయతీ పరిధిలో పారిశుద్ధ్య కార్యక్రమాలలో లోటుపాట్లు చూడాలని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు.

## ఇల్లు పడిపోవడం పై ఆర్డీవోకి వినతిపత్రం



**రాపూరు, మేజర్‌న్యూస్ :** పిఎల్‌ఆర్ స్టోన్ క్రషర్స్ బ్లాస్టింగ్ వలన ఇల్లు కోల్పోయిన బాధితునికి న్యాయం చేయాలని, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న పిఎల్‌ఆర్ స్టోన్ క్రషర్‌ను ఆపాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ ఆధ్వర్యంలో నెల్లూరు ఆర్డీవో కు సోమవారం వినతి పత్రం అందజేశారు. మండలంలోని పులిగల పాడు గ్రామ సమీపంలో ఉన్న పిఎల్‌ఆర్ స్టోన్ క్రషర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బ్లాస్టింగ్ వలన పులిగిలపాడు గ్రామ నివాసి అయిన అత్తి బాలకృష్ణ ఇల్లు స్లాబ్ పెచ్చులోడి పూర్తిగా పడిపోవడం జరిగింది. ఈ సమస్యపై బాధితులతో కలిసి ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ ఆధ్వర్యంలో నెల్లూరులో ప్రజా విజ్ఞప్తి పరిష్కార వేదికలో నెల్లూరు ఆర్డీవోని కలిసి సమస్యను వివరించారు. ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కన్వీనర్ వాసు నరసింహారావు, లీలా మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## టపాసుల గోడౌన్‌లను తనిఖీ : డీఎస్పీ శ్రీధర్



**బోగోలు, మేజర్‌న్యూస్ :** బోగోలు మండలం విశ్వనాథరావుపేట పరిధిలోని టపాసులు గోడౌన్‌ను సోమవారం కావలి డీఎస్పీ శ్రీధర్ తనిఖీ చేపట్టారు. నెల్లూరు జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దీపావళి పండుగను దృష్టిలో ఉంచుకొని టపాసుల గోడౌన్‌లను తనిఖీ చేపట్టినట్లు కావలి డీఎస్పీ శ్రీధర్ తెలిపారు. ఈ సందర్భంగా కావలి డీఎస్పీ మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన కొన్ని సంఘటనలను దృష్టిలో ఉంచుకొని టపాసులు అమ్మకాలు చేస్తున్న వ్యాపారస్తులకి తగు సూచనలు అందించారు. టపాసుల అమ్మకాలు నిర్వహిస్తున్న ప్రాంతాలలో అగ్ని ప్రమాదాలు సంభవించకుండా తగు జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు. లైసెన్సులు లేకుండా టపాసులు అమ్మకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిట్రగుంట ఎస్ఐ బోజ్య నాయక్ వారి సిబ్బంది పాల్గొన్నారు.

# రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే నాగేశ్వరరావు



**కందుకూరు, మేజర్‌న్యూస్ :** పట్టణంలోని శ్రీ వెంగమాంబ కళ్యాణమండపం నందు పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా కందుకూరు సబ్ డివిజన్ పోలీస్ వారి ఆధ్వర్యంలో జరుగుతున్న రక్తదాన శిబిరాన్ని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో భాగంగా ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమర వీరులను స్మరించుకుంటూ అక్టోబర్ 21 పోలీసుల అమరవీరుల దినోత్సవంగా జరుపుకుంటామని, విధి నిర్వహణలో తమ కుటుంబాల సైతం దూరంగా ఉంటూ ప్రజల కోసం పోలీసులు పని చేస్తారని తెలిపారు. విధినిర్వహణలో ఉన్న పోలీసుల్ని గౌరవించడం మన కర్తవ్యంగా ప్రతి పౌరుడు భావించాలని ఎమ్మెల్యే కోరారు. అన్ని దానాల్లో కన్నా రక్తదానం గొప్పది అన్నారు. రక్తదానం చేయటం వల్ల ఆపదలో ఉన్న మరో ప్రాణాన్ని రక్షించే అవకాశం మనకు లభిస్తుందని తెలిపారు. ఇలాంటి గొప్ప కార్యక్రమాన్ని పోలీసు అమర వీరులను స్మరించుకుంటూ ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. రక్తదానం చేసేందుకు ముందుకు వచ్చిన ప్రతి ఒక్కరిని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరావు అభినందించారు.

### పీహెచ్‌పీ అధ్యక్షులు వేణుగోపాలుకు

# పోలీస్ అమరవీరుల ప్రశంసా పత్రం




**నెల్లూరు క్రైం, మేజర్‌న్యూస్ :** పోలీస్ అమర వీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జిల్లా ఎస్పీ జి.కృష్ణ కాంత్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ పారా మెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సహకారంతో నెల్లూరు నగరంలోని సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ సౌజన్యంతో 13మంది ప్రముఖ వైద్య నిపుణులచే మెగా ఉచిత వైద్య శిబిరంను ఏర్పాటు చేసినందుకుగాను జిల్లా ఎస్పీ జి.కృష్ణ కాంత్ చేతుల మీదుగా పీహెచ్‌పీ జిల్లా అధ్యక్షులు శాఖవరపు వేణుగోపాల్‌కు, ప్రధాన కార్యదర్శి గోరంట్ల శేషయ్యకు పోలీస్ అమరవీరుల ప్రశంసా పత్రాన్ని అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ మాట్లాడుతూ.. పోలీస్ అధికారులకు వారి కుటుంబ సభ్యులకు, పరిసర ప్రాంత వాసులకు స్పెషాలిటీ వైద్యులచే ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి, అన్ని రకాల పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేయడం జరిగిందని, ఈసీజీ, బీపీ, రక్త పరీక్షలు కూడా ఉచితంగా నిర్వహించడం జరిగిందన్నారు. వైద్య శిబిరం ఏర్పాటు చేసిన పీహెచ్‌పీ అసోసియేషన్ సేవలు ఎంతో అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సిహెచ్ సౌజన్య, పోలీసు వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు మద్దిపాటి ప్రసాదరావు, పోలీస్ హాస్పిటల్ మెడికల్ ఆఫీసర్ డా. ఎస్.అకిలేశ్, ఏఆర్ డీఎస్పీ వెంకటేశ్వరరావు, ఆర్ఐ.రాజారావు, పీహెచ్‌పీ గౌరవాధ్యక్షులు అనుముల జయప్రకాష్, నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, డా.పి.అశ్విన్ కుమార్, డా. బి.రాజేందర్ రెడ్డి, డా.పి.మాధవ్, డా.పి.సుధీర్, డా.ఎం.వెంకట తరుణ్, డా.జి.సుజిత డా.ఏ.వైష్ణవి, డా.సి.ప్రేమ్‌దీప్, డా.ఎస్.శ్వేత, డా.డి.అజయ్ కుమార్, డా.పి.వసుమతి, డా.జీవీఎస్.మానస, డా.ఆర్.గోకుల్ కృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

# విత్తన దుకాణాలను తనిఖీ చేసిన వ్యవసాయాధికారులు



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరంలో ఉన్న వర్షిత సీడ్స్,కావేరి సీడ్స్, ఇందిర సీడ్స్ తదితర వరి విత్తనాలు విక్రయించే దుకాణాలను నెల్లూరు మండల వ్యవసాయాధికారి ఎస్.వి నాగమోహన్ తనిఖీ చేసి దుకాణంలోని విత్తన నాణ్యత రిజిస్టర్, స్టాక్ రిజిస్టర్ మొదలైన వివరాలను, కొనుగోలు చేసిన రైతుల వివరాలు, బిల్ పుస్తకాలు, రసీదులు మొదలైన వివరాలు తనిఖీ చేసినారు. దుకాణంలోని ప్రతి లాట్ లోని విత్తనాలను మొలక పరీక్ష చేయాలని, మొలక శాతం 80శాతం కంటే ఎక్కువగా ఉన్న నాణ్యమైన విత్తనాలను మాత్రమే విక్రాయించాలని తెలియజేశారు. కొనుగోలు కొరకు వచ్చిన రైతులతో మాట్లాడుతూ.. విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా రసీదును తీసుకొని జాగ్రత్తగా ఉంచుకోవాలని, విత్తన నాణ్యతలో లోపాలు ఉన్నట్లయితే సరిఅయిన బిల్లుతో స్థానిక వ్యవసాయ అధికారులను సంప్రదించాలని తెలియజేశారు. రైతులు విధిగా మొలక కట్టి సంతృప్తి చెందిన తర్వాత మాత్రమే నార్లు పోసుకోవాలని తెలియజేశారు.

## స్కూల్ గ్రాంట్స్ నిధులతో పాఠశాలను అభివృద్ధి పరచండి

**నెల్లూరు (విద్య), మేజర్‌న్యూస్ :** ప్రాథమిక, మాధ్యమిక, సీనియర్ సెకండరీ పాఠశాలలకు 2024-25 కాంపోజిట్ స్కూల్ గ్రాంట్స్ కింద జిల్లాకు ఆరు కోట్ల నిధులు కేటాయించడం జరిగిందని రాష్ట్ర సమగ్ర శిక్ష ప్రాజెక్టు కోఆర్డినేటర్ శ్రీనివాసరావు ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని కస్తూర్బా బాలిక విద్యాలయాలు, జూనియర్ కళాశాలలు, పీఎం శ్రీస్కూల్స్‌లు కలిపి ఈ గ్రాంటును కేటాయించడం జరిగిందని తొలి విడుదల 50శాతం నిధులు విడుదల చేసినట్లు ఆయన తెలిపారు. గత ప్రభుత్వంలో నాడు-నేడు కింద చేసిన పనులు నాణ్యత లోపాల వలన పలుచోట్ల దురదృష్టకరణ సంఘటన చోటు చేసుకున్న విషయం విధితమే. కావున తల్లిదండ్రులు అటువంటి దురదృష్టకర సంఘటన మరలా చోటు చేసుకోకుండా ఆ నిధులను పాఠశాల కళాశాలల అభివృద్ధికి కేటాయిస్తే బాగుంటుందని అభిప్రాయపడుతున్నారు. ఇటీవల ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా కమిటీలు ఏర్పాటు అయిన విషయం విదితమే కావున ఈ నిధులను వారి ద్వారా అభివృద్ధి పనులు చేయిస్తే పనులు నాణ్యతతో జరుగుతాయని వారు అభిప్రాయం వ్యక్త పరుస్తున్నారు.

## జయభారత్ హాస్పిటల్‌లో చీరల పంపిణీ




**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జయభారత్ హాస్పిటల్‌లో పనిచేస్తున్న నర్సులకు శ్రీ రంగనాథ భక్తి మండలి, శ్రీ రాజరాజేశ్వరి భక్తమండలి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో చీరలు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా డాక్టర్ సీతాలక్ష్మి పాల్గొన్నారు. ఆమె చేతుల మీదుగా వందమంది మహిళా సిబ్బందికి చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సీతాలక్ష్మి మాట్లాడుతూ.. దీపావళి పండుగను పురస్కరించుకొని నిర్వాహకులు మెంటా రామమోహన్‌రావు ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. గత 20 సంవత్సరాలుగా ధార్మిక ఆధ్యాత్మిక కార్యక్రమాలతోపాటు ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయడం ఆనందకరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేత మిడతల రమేష్, అల్లూరి నాగేంద్ర సింగ్, నీలిశెట్టి లక్ష్మణరావు, సుజాత, మిడతల మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## స్టాళ్లను సందర్శించిన అదనపు కమిషనర్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** మహిళా సాధికారతే లక్ష్యంగా పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేసిన ఉత్పత్తులను విక్రయించే స్టాళ్లను ప్రజలంతా సందర్శించి, వారిని ప్రోత్సహించాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ నందన్ ఆకాంక్షించారు. స్థానిక బారా షాహీద్ దర్గా రోడ్డు సమీపంలో ఏర్పాటు చేసిన విక్రయ స్టాళ్లను అదనపు కమిషనర్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు స్వయం ఉపాధికై వినూత్న ఆలోచనలతో తయారు చేస్తున్న వివిధ రకాల గృహ అవసరమైన ఉత్పత్తులను కొనుగోలు చేసి ప్రజలంతా వారి ఆర్థిక అభ్యున్నతికి సహకరించాలని కోరారు. స్టాళ్లలో ప్రతి ఒక్క ఇంటికీ అవసరమైన అన్ని ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయని అదనపు కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ టీపిఆర్ఓ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పనిచేయని ఆధార్ కేంద్రాలు

**● అవస్థల్లో ప్రజలు, విద్యార్థులు**

**అనుముసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** మండలంలోని పలు సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలు పనిచేయకపోవడంతో మండలంలోని ప్రజలు విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మండలంలోని గుడిపాడు జమ్మవరం గ్రామాల్లోని సచివాలయాల్లో ఆధార్ నమోదు సవరణలు చేర్పులు కోసం ఆధార్ కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది అయితే గత కొంతకాలంగా ఈ రెండు గ్రామాల్లోని ఆధార్ కేంద్రాలు పనిచేయక పోవడంతో ప్రజలు విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. దాంతో ఇతర మండలాలకు ఎంతో ఖర్చు పెట్టి ఆధార్‌లో సవరణల కోసం వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు కావున జిల్లా అధికారుల స్పందించి ఆధార్ కేంద్రాలను పునరుద్దరించాలని మండల ప్రజలు కోరుతున్నారు. అలాగే మండల కేంద్రమైన ఏఎస్‌పేట సచివాలయంలో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



# మందకృష్ణమాదిగ పర్యటనను జయప్రదం చేయాలి



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లాలో నవంబర్ 3వ తేదీన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణమాదిగ పర్యటిస్తారని, అందరూ విరివిగా పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎంఎస్పీ జాతీయనాయకుడు గొల్లపల్లి శ్రీనివాసులు మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సూరిపాక ఉదయ్‌కృష్ణమాదిగ, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు పందిటి అంబేద్కర్ మాదిగ, రాష్ట్ర నాయకులు గోచిపాతల వెంకటేశ్వర్లు మాదిగలు కోరారు. సోమవారం ఆత్మకూరులోని త్రికోటేశ్వర కళ్యాణ మండపంలో గడ్డం ఆదినారాయణ మాదిగ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు పాల్గొని ప్రసంగించారు. దేశ అత్యున్నత న్యాయ స్థానం (సుప్రీమ్‌కోర్టు) ఎస్సీ వర్గీకరణపై ఇచ్చిన తీర్పు అమలు రాష్ట్రాలకు అప్పగించారన్నారు. అమలు కోసం అడుగులు వేస్తున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగఅన్ని జిల్లాల్లో పర్యటనల్లో భాగంగా నవంబర్3వతేదీన నెల్లూరు జిల్లాలో పర్యటించనున్నారని వారు పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే ఎస్సీ వర్గీకరణ అమలుచేయాలని, అనంతరమే ఉద్యోగాల భర్తీప్రక్రియ సాగించాలని వారు కోరారు. మాదిగల ఆరాధ్యదైవం మంద కృష్ణమాదిగ అలుపెరుగని పోరాటాలు చేసి సుప్రీమ్‌కోర్టులో గెలిచి రాష్ట్ర ప్రభుత్వం అందించే అన్ని ఫలాలు పొందేవిధంగా చేసిన ఘనుడని వారు కొనియాడారు. ఆత్మకూరు నియోజకవర్గంలోని ఆరు మండలాలనుండి మందకృష్ణమాదిగ పర్యటనకు అధికంగా తరలిరావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎఫ్, ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు వేగూరు వెంకటేశ్వర్లు, తాటిపర్తి లక్ష్మయ్యమాదిగ, గంగపట్ల లక్ష్మమ్మమాదిగ, వడ్లపల్లి రమణమ్మమాదిగ, తాటిపర్తిపెంచలయ్యమాదిగ, సిద్దారపు పెంచలయ్యమాదిగ, దుద్దు రవిమాదిగ, నల్లపోగు అంకయ్యమాదిగ, చాట్ల ఆనంద్‌మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీభవనాల నిర్మాణాలు త్వరగా పూర్తిచేయాలి

## ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్



ఆత్మకూరు ఐసిడిఎస్ కార్యాలయంలో సమీక్షిస్తున్న జిల్లా ప్రాజెక్ట్‌డైరెక్టర్ బి.హేనాసుజన్

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్‌పరిధిలో నిర్మాణాలు అర్ధాంతరంగా నిలిచిపోయిన అంగన్‌వాడీ భవనాలను త్వరితగతిన పూర్తిచేసేలా తగు చర్యలు తీసుకోవాలని జిల్లా ఐసీడీఎస్ పీడీ బి.హేనాసుజన్ స్థానిక సీడీపీఓ, సూపర్‌వైజర్లను ఆదేశించారు. సోమవారం హేనాసుజన్ ఆత్మకూరు కార్యాలయాన్ని సందర్శించి స్థానిక సీడీపీఓ పి.సునీలత, సూపర్‌వైజర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పలు రికార్డులను, కార్యాలయ నిర్వహణను ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా పీడీ మాట్లాడుతూ.. 15శాతం జిల్లాపరిషత్ నిధులతో నిర్మాణంలో ఉన్న అంగన్‌వాడీ భవనాలను పూర్తిచేయించాలని సూచించారు. స్వంత అంగన్‌వాడీకేంద్ర భవనాల్లో న్యూటాయిలెట్స్ ద్వారా మంజూరైనవాటిని కూడా త్వరితగతిన పూర్తిచేయాలని ఆమె కోరారు. 45సక్ష్యం అంగన్‌వాడీకేంద్రాల గురించి, ఆసెంటర్ల పరిధిలోని న్యూట్రిగార్డెన్స్, రెయిన్‌హార్వెస్టింగ్ తదితర అంశాల గురించి హేనాసుజన్ సమీక్షించారు. ఆత్మకూరు ప్రాజెక్ట్ పరిధిలో ఎక్కడా బాల్యవివాహాలు జరుగకుండేలా అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. ఈవిషయమై అన్ని పాఠశాలలు, వివిధ ప్రాంతాల్లో అవగాహనా సదస్సు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలని కూడా ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఐసీడీఎస్ సీడీపీఓ పి.సునీలత, సూపర్‌వైజర్లు ఎం.రత్నమ్మ, ఎన్.కేశవనారాయణమ్మ, ఎన్.నాగేశ్వరమ్మ, విజయలక్ష్మి, కస్తూరి, రమాదేవి, సురేఖ, పద్మ, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**అనుకున్నదొకటి.. అయ్యింది ఒకటి !**

# బోల్తా కొట్టిన అధికారుల చర్య

*మొదటి పేజీ తరువాయి)*

ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలాలను విడిపించాలన్న ఉద్దేశంతో అక్కడ నివాసముంటున్న పందుల పెంపకం దారులను వారికి కేటాయించిన స్థలాల్లోకి వెళ్ళమని ఆదేశిస్తూ తరలించారు. అయితే వీళ్లకు కేటాయించిన స్థలాల వద్దకు వెళ్లి సమయంలో స్థానికుల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురయింది. దీంతో అధికారుల చర్యలు పెనం మీద నుంచి పొయ్యిలో పడినట్లుగా మారింది. ఎట్టకేలకు ఆక్రమణ ప్రభుత్వ భూములకు విముక్తి లభిస్తుందని తీసుకున్న చర్యలకు ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత రావటంతో అధికారుల పరిస్థితి ముందు గొయ్యి వెనకనొయ్య అనే సామెతల మారింది. ఏమి చేయాలో దిక్కుతోచని స్థితిలో ఉన్న అధికారులు మునుముందు ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారు అని ప్రజలు ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. పందుల పెంపకం దారులకు కేటాయించిన స్థలాలు ఉన్న మంగళి కట్ట, పెద్దూరు, ప్రాంతాలకు పందుల పెంపకం దారులను అధికారులు తరలించారు. అయితే ఆయా ప్రాంతాల్లో ఉన్న ప్రజలు వీరు వస్తే తమ ప్రాంతాల్లో వివాదాలు పెరుగుతాయని వారు మా ప్రాంతానికి రావడం ఇష్టం లేదని ఆయా ప్రాంతాలకు చెందిన వారు సోమవారం తహసిల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు.



## సామాజిక తనిఖి బృందంతో సమావేశం



**రాపూరు, మేజర్‌న్యూస్ :** రాపూరులోని మండల తహసీల్దార్ కార్యాలయం సమావేశ మందిరంలో ఉపాధి హామీ సిబ్బంది, క్షేత్ర సహాయకులతో ఎస్‌టీఎం కోనయ్య సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఉపాధి ఏపీఎం సుబ్బరాయుడు మాట్లాడుతూ.. గత ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి పనులను ఆడిట్ చేయడానికి ఆడిట్ సిబ్బందికి కార్యాలయ సిబ్బంది, క్షేత్ర సహాయకులు సహకారం అందించాలన్నారు. మండలంలో సుమారు పదిహేను కోట్ల రూపాయలు పనులు చేసి ఉన్నామన్నారు. అంతకు ముందు ఆడిట్ సిబ్బంది, క్షేత్ర సహాయకుల పరిచయ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధి ఎస్‌టీఎం కోనయ్య, ఎస్ఆర్‌పి, డీఆర్‌పిలు ఉపాధి సిబ్బంది, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

## గడ్డివామి దగ్ధం



**విడవలూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని దంపూరు గ్రామానికి చెందిన కె.రాజా అనే వ్యక్తి గడ్డివామి దగ్ధమైన ఘటన సోమవారం వేకువన చోటుచేసుకుంది. బాధితుడు కథనం మేరకు తాను 9 ఎకరాలకు చెందిన గడ్డివామిని ఏర్పాటు చేసుకున్నానని తెలిపారు. అయితే సోమవారం వేకువజామున తన గడ్డివాము నుంచి మంటలు రావడానికి స్థానికులు గుర్తించే తనకు తెలిపారని వెల్లడించారు. దీంతో అందరు సహకారంతో మంటలను ఆర్పేందుకు ప్రయత్నం చేసినప్పటికీ అదుపులోకి రాకపోవడంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించామని తెలిపారు. దీంతో వారు సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకువచ్చారని పేర్కొన్నారు. అయితే ఎవరో గుర్తు తెలియని వ్యక్తులే తమ గడ్డివామికి నిప్పు పెట్టి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు.

## బాణాసంచా విక్రయ దారులకు అవగాహన



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** బాణసంచా నిల్వలు, విక్రయాలపై ప్రభుత్వం సూచించిన నిబంధనలు పాటించకపోతే చట్టపరమైన చర్యలు తప్పవని తహసీల్దారు సుభద్ర, సీఐ వెంకటరావులు పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని పలు బాణసంచా దుకాణాలు తనిఖీ చేసి నిల్వలను, దీపావళి పర్వదినం సందర్భంగా దుకాణాలు ఏర్పాటు చేసే స్థలాన్ని పరిశీలించి నిర్వాహకులకు తగు సూచనలు, సలహాలు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. అనుమతుల్లేకుండా బాణసంచా నిల్వ చేసినా, విక్రయాలు చేపట్టినా చర్యలు తప్పవని హెచ్చరించారు. బాణసంచా విక్రయాల సమయంలో ఇతర ప్రదేశాల్లో చోటుచేసుకొన్న ప్రమాదాలను దృష్టిలో ఉంచు కొని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. లైసెన్సు కలిగిన వారు మాత్రమే దుకాణాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు కర్నాటి ఇంద్రసేనారెడ్డి, ఏ.శ్రీనివాసులు, ఆర్‌ఐ సురేంద్ర నిర్వాహకులు, పోలీసు తదితరులు పాల్గొన్నారు.

## నేడు రక్తదాన శిబిరం

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు ఎస్‌ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి యువత, విద్యార్థులు, గ్రామ ప్రజలు అధికసంఖ్యలో హాజరై రక్తదానం చేసి మరొకరి ప్రాణాలు కాపాడాలని ఆయన కోరారు.

# బాధిత విద్యార్థినిని పరామర్శించిన మాజీ విజిలెన్స్ మెంబర్



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** అనంతసాగరం మండలం కొత్తపల్లికి చెందిన ఒక విద్యార్థినిని ఓ వివాహిత వ్యక్తి ప్రేమపేరుతో లోబరుచుకొని మోసం చేయగా మనస్థాపానికి గురైన ఆ విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆత్మకూరులోని జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతుండగా సోమవారం మాజీవిజిలెన్స్ అండ్ మానిటరింగ్ సభ్యుడు శేషం సుదర్శన్. అంబేద్కర్‌సేన వ్యవస్థాపక అధ్యక్షుడు కొప్పాల రఘులు పరామర్శించారు. అనంతసాగరం మండలం లింగగుంటకు చెందిన వివాహమై ఇద్దరు సంతానం కలిగిన వ్యక్తి కొత్తపల్లికి చెందిన ఇంటర్ విద్యార్థినిని మాయమాటలు చెప్పి వివాహం చేసుకుంటానని నమ్మించి లోబరుచుకున్నాడని, ఆ విద్యార్థినితో కలిసున్న ఫోటోలు, వీడియోలు తీసి వాటిద్వారా బెదిరించడంతోపాటు ఆ విద్యార్థిని చదివే కాలేజీకి కూడా పంపాదని, దాంతో ఆమె మనస్థాపం చెంది నిద్రమాత్రలు మ్రింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా హాస్పిటల్‌లో చికిత్స పొందుతుందన్నారు. నిందితుడిని అరెస్ట్ చేసిన డిఎస్‌పి వేణుగోపాల్, సిఐ గంగాధర్, ఎస్ఐ, సిబ్బందికి వారు అభినందనలు తెలిపారు. ఆ విద్యార్థినికి ప్రభుత్వపరంగా రావాల్సిన సాయం కోసం తమవంతుగా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళి కృషి చేస్తామని వారు పేర్కొన్నారు.

# ఎరువులు, పురుగుమందులు, విత్తనాల షాపుల్లో ఆకస్మిక తనిఖీలు





**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణం లోని పలు ఎరువులు, పురుగుల మందులు, విత్తనాల దుకాణాలను సోమవారం వ్యవసాయాధి కారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. నెల్లూరు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎన్.శ్రీని వాసులు దుకాణాలను తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లు, బిల్లు పుస్తకాలు తదితరాలను ఆయన పరిశీలించారు. రైతులు విత్తనాలను అధీకృత డీలర్ల వద్దనే కొనుగోలు చేయాలని ఆయన సూచించారు. తప్పకుండా దుకాణంలో బిల్లు అడిగి తీసుకోవాలని కూడా ఆయన కోరారు. విత్తనాల మొలక సరిగా లేకుండే వెంటనే స్థానిక వ్యవసాయాధికారిని సంప్రతించాలని ఆయన పేర్కొన్నారు. రైతులు కెఎన్ఎం1638, ఆర్ఎన్ఆర్15048 వరి విత్తనాలను నవంబర్ 15వ తేదీ తరువాతనే నారుమడి పోసుకోవాలని ఆయన సూచించారు. లైసెన్స్ లేకుండా ఎవరైనా విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కె.కిషోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

### 13వ డివిజన్లోని టీడీపీ చేసిన కాలువ ఆక్రమణలపై

# పూర్తి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

**13వ డివిజన్ కార్పొరేటర్**
**ఊటుకూరు నాగార్జున**

**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** స్థానిక 13వ డివిజన్‌లో టీడీపీ నాయకులు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని అదేవిధంగా డివిజన్లోని టీడీపీ నాయకులు చేసిన కాలువ ఆక్రమణలపై పూర్తి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ 13 డివిజన్ కార్పొరేటర్ ఊటుకూరు నాగార్జున సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి మున్సిపల్ కార్పొరేషన్ అదనపు కమిషనర్ నందన్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 13వ డివిజన్‌లో వర్క్ స్థానంలో అక్రమ కట్టడం జరపడాన్ని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అడ్డుకుందన్న నెపంతో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీపై టీడీపీ నేతలు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, అసలు గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే డివిజన్‌లో కాలువ ఆక్రమణలు జరిగాయన్న విషయం ప్రతి ఒక్కరికి తెలుసునని ఆరోపించారు. ఇప్పుడు టీడీపీ నేత ఉచ్చి భువనేశ్వర్ ప్రసాద్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలోనే కాలువా ఆక్రమణలు జరిగాయని, దీనిపై 607 సర్వే నెంబర్ ప్రకారం రి సర్వే చేయాలని కమీషనర్‌కి ఫిర్యాదు చేయడం హాస్యాస్పదమన్నారు. తాము కూడా 607 సర్వేనెంబర్ ప్రకారం కాలువ ఎక్కడి నుంచి అయితే ప్రారంభమైందో అక్కడ నుంచి రి సర్వే జరిపి ఆక్రమించుకున్న వారు ఎంతటి వారైనా ఉపేక్షించకుండా చర్యలు తీసుకోవాలని అదనపు కమిషనర్‌ని కోరుతూ వినతిపత్రం సమర్పించామని తెలియజేశారు. డివిజన్లో అభివృద్ధి జరిగిందంటే అది కేవలం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యపడిందని, తమకు చిత్తశుద్ధి ఉంటే 13 డివిజన్‌లో పెండింగ్లో ఉన్న పార్కు పనులు పూర్తి చేసి చూపించాలని కోరారు. టీడీపీ నేత ఉచ్చిభువనేశ్వర్ ప్రసాద్ పబ్లిసిటీ పిచ్చితో అర్థం పర్థం లేని ఆరోపణలన్నీ చేస్తున్నారని ఆరోపించారు. అదేవిధంగా తనని రాజకీయంగా దెబ్బతీయాలని, టీడీపీకి ఓటు వేయలేదని ఒక అనుమానంతో నా డివిజన్‌లోని 6 మంది నిరుపేదలను మంత్రి నారాయణ తన సంస్థలో ఉద్యోగం నుంచి నిట్ట నిలువునా తీసేసి పేదల కడుపు మండించారన్నారు, ఇంకో సారీ తనపై చౌకబాలు ఆరోపణలు చేస్తే తగిన బుద్ధి చెబుతామని ఈ సందర్భంగా హెచ్చరించారు.

## ఉపకార వేతనాలకు దరఖాస్తులు ఆహ్వానం

**నెల్లూరు (విద్య), మేజర్‌న్యూస్ :** ప్రధానమంత్రి స్కాలర్షిప్ పథకం 2024-25లో మాజీ సైనికుల పిల్లలకు కేంద్రీయ సైనిక్ బోర్డు న్యూఢిల్లీ దరఖాస్తులు ఆహ్వానించిందని జిల్లా సైనిక వెల్ఫేర్ అధికారి ఇన్ పద్మజ ఒక ప్రకటనలో తెలిపారు. బిఈ, ఎంబీబీఎస్, బీబీఏ, పీసీఏ, బీఈడీ, బీఫార్మసీ, బీఏ, ఎల్ఎల్‌బి, సాంకేతిక, విద్యా కోర్సులలో చేరిన వారు ఈ ఉపకార వేతనాలు పొందేందుకు అర్హులని, ఇంటర్మీడియట్లో 60శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలని, బాలురకు నెలకు రూ.2,500 బాలికలకు రూ.3వేలు మంజూరు చేస్తారని, అర్హత ఉన్న అభ్యర్థులు కేంద్రీయ సైనిక బోర్డు న్యూఢిల్లీ వెబ్‌సైట్‌లో నవంబర్ 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఆమె తెలిపారు.

## భూ అక్రమణపై తహసీల్దారుకు ఫిర్యాదు



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోని జి.చెర్లోపల్లి గ్రామంలో రంగమ్మ పేరంటాలమ్మ గుడిసమీపంలో భూమిని కొందరు గ్రామస్తులు అక్రమించి చదును చేసి విక్రయం చేసేందుకు చర్యలు చేపడుతున్నారని గ్రామస్తులు సోమవారం తహసీల్దారు సుభద్రకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గుడి సమీపంలో ప్రభుత్వ భూములకు పట్టాలు పొందిన వారు ఉత్తరము, తూర్పు వైపున్న సుమారు సుమారు 1.50ఎకరాల ప్రభుత్వ వాగుపోరంబోకు భూమిని ఆక్రమించారని, ఆ భూమిని ఆక్రమణదారుల నుంచి రక్షించాలని కోరారు. స్పందించిన తహసీల్దారు గ్రామానికి వెళ్లి భూముల పరిశీలించి ఆక్రమణ దారులపై కఠిన చర్యలు తీసుకొంటామని హామీఇచ్చారు.

## బాధితురాలిని పరామర్శించిన ఐసీడీఎస్ పీడీ

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** చేజర్ల మండలంలో ఓ గిరిజన మహిళ ఒక వ్యక్తి వేధిస్తుండగా మనస్తాపం చెంది ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆత్మ కూరులోని జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతుండగా సోమ వారం జిల్లా ఐసీడీఎస్ పీడీ బి.హేనాసుజన్ పరామర్శించారు. చేజర్ల మం డలం యనమదలకు చెందిన ఒక గిరిజన మహిళను అదేగ్రామానికి చెందిన మలినేని పెంచలయ్య కొద్దిరోజులుగా మానశికంగా హింసిస్తుం డడంతో ఆ మహిళ గుళికలు మ్రింగి ఆత్మహత్యాయత్నంకు పాల్పడింది. ఐసిడిఎస్ సిబ్బంది, పోలీసులు ఆమెను ఆత్మకూరులోని జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించగా చికిత్స పొందుతుంది. ఐసీడీఎస్ పీడీ హాస్పిట లకు విచ్చేసి ఆ మహిళను పరామర్శించి ఆమెనడిగి వివరాలు తెలుసు కున్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ పి.సునీలతీ, సూపర్ వైజర్లు ఎం.రత్నమ్మ, సి.హెచ్.సురేఖ, వన్‌స్టాప్ సెంటర్‌కోఆర్డినేటర్ జి.సాధన తదితరులు ఆ మహిళకు, ఆమె తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చారు.

## విత్తన, పురుగుమందుల దుకాణాలు తనిఖీ



**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** మండలంలోని హసనాపురం ఏఎస్పేట గ్రామాల్లోని ఎరువులు పురుగుమందులు విత్తన దుకాణాలను నెల్లూరు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎన్ శ్రీనివాసులు సోమవారం తనిఖీ చేశారు ఈ సందర్భంగా ఆయా షాపుల్లోని రికార్డులను స్టాకు రిజిస్టర్లను తనిఖీ చేశారు. విత్తనాలు పురుగుమందులు ఎరువులు కొనుగోలు చేసినప్పుడు రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని తెలిపారు. స్టాకు వివరాలను రేట్లు షాపు వద్ద పట్టికలో రాయాలని తెలిపారు. రైతులు విత్తనాలను మొలక కట్టి చూసుకొని నారు పోసుకోవాలని సూచించారు. ఒకవేళ మొలక శాతం తగ్గినయెడల మండల వ్యవసాయ శాఖ అధికారిని సంప్రదించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పేట మండల వ్యవసాయ అధికారిని టి.రజిని ఆత్మకూరు మండల వ్యవసాయ అధికారి కిషోర్ బాబు పాల్గొన్నారు.

## ముమ్మరంగా తెలుగుదేశం సభ్యత్వకార్యక్రమం

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణంలోని 12వవార్డు పరిధిలో తెలుగుదేశం నాయకురాలు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ గోరిపర్తి నాగభూషణమ్మ ఆధ్వర్యంలో సోమవారం తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ముమ్మరంగా నిర్వహించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర దేవాదాయశాఖా మంత్రి ఆనం రామ నారాయణరెడ్డిల ఆదేశాలమేరకు 2024-26 సంవత్సరాలకు తెలుగు దేశం పార్టీ సభ్యత్వాలను ఆమె ముమ్మరంగా నమోదు చేయించారు. తెలుగుదేశం సభ్యత్వం స్వీకరించిన వారికి కలిగెడి ప్రయోజనాలను ఆమె అందరికీ వివరించగా అనేకమంది స్వచ్ఛందగా పార్టీ సభ్యత్వం స్వీకరిం చారు. గతంలో సభ్యత్వం కలిగిన వారు రెన్యువల్ చేయించుకున్నారు.

# బాధితులకు అండగా సీఎం రిలీఫ్ ఫండ్

- వైద్యం, విద్యకు పెద్దపీఠ వేస్తున్న సీఎం చంద్రబాబునాయుడు
- బడుగు బలహీనవర్గాలకు భరోసాగా నిలస్తున్న కూటమి ప్రభుత్వం
- పలువురు బాధితులకు రూ.6.18 లక్షల సీఎంఆర్ఎఫ్ నిధులు అందజేసిన మంత్రి డాక్టర్ నారాయణ
- టీడీపీ శ్రేణులకు సమస్యల పరిష్కారంపై దిశానిర్ధేశం



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, ఆరోగ్యం పట్ల పూర్తి భరోసా కల్పిస్తోందని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలియజేశారు. నెల్లూరులోని గోమతినగర్‌లో ఉన్న మంత్రి క్యాంప్ కార్యాలయంలో మంత్రి నారాయణ సోమవారం డివిజన్ టీడీపీ అధ్యక్ష, కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. స్థానికంగా డివిజన్లలో నెలకొన్న సమస్యలపై చర్చించారు. ఆయా సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించేందుకు అధికారులతో సమన్వయం చేసుకుని పరిష్కరించాలని మంత్రి సూచించారు. అనంతరం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన నిధులను బాధిత కుటుంబాల వారికి అందజేశారు. సీఎం రిలీఫ్ పండ్ అందుకున్న వారిలో సిటీ నియోజకవర్గానికి చెందిన కొండూరు శివప్రసాద్ రూ.2,39,321, కాసిరెడ్డి చిన్నపరెడ్డి రూ.1,08,600, కందుకూరు శ్రీనివాసచార్యులు రూ.1,18,881, యల్లాల పెంచలయ్య రూ.76,304, నాయుడు సుజన రూ.75,000 వంతున మొత్తం రూ.6,18,106 నిధులను అందుకున్నారు. బాధిత కుటుంబాల వారంతా మంత్రి నారాయణకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ మాట్లాడుతూ.. ప్రాణాపాయ స్థితిలో ఉన్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా చికిత్సకు తగిన ఆర్థిక సాయం కూటమి ప్రభుత్వం అందిస్తోందన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఎందరో నిరుపేదల ప్రాణాలు నిలబడుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో వైద్యం, విద్యకు సీఎం చంద్రబాబునాయుడు పెద్దపీట వేస్తున్నారని కొనియాడారు.

# కృష్ణపట్నం ఓడరేవులో ఉద్రిక్త వాతావరణం



- ఎమ్మెల్యే సోమిరెడ్డి వెంట వెళ్లిన మీడియాను అడ్డుకున్న భద్రతా సిబ్బంది
- ఎందుకు అడ్డుకున్నారంటూ సెక్యూరిటీపై ఎమ్మెల్యే సోమిరెడ్డి ఆగ్రహం
- మీడియాకు మద్దతు తెలిపిన ఎమ్మెల్యే సోమిరెడ్డి
- అతిగా ఉండొద్దంటూ హెచ్చరికలు

**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** కంటైనర్ టెర్మినల్ వ్యవస్థను మరల పునరుద్ధరణ చేయాలని ప్రతిపక్షం నుంచి అధికారంలోకి వచ్చేంతవరకు సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పోరాటం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం ఆయన కృష్ణపట్నం పోర్టుకు వచ్చారు. ఈ విషయంపై పోర్టు యాజమాన్యంతో మాట్లాడేందుకు అఖిలపక్ష పార్టీలైన బిజెపి, జనసేన, సిపిఎం, సిపిఐ పార్టీలను తీసుకొచ్చారు. 11 గంటలకు కృష్ణపట్నం పోర్టుకు చేరుకున్న ఆయన గోపాలపురం వద్ద పోర్టు అధికారులతో ఈ విషయంపై మాట్లాడారు. చివరకు పోర్టు సీఈఓ జగదీష్ పటేల్ ఆహ్వానం పలకడంతో అఖిలపక్ష పార్టీ నాయకులను, మీడియా ప్రతినిధులను వెంటబెట్టుకుని వాహనాల్లో ఎమ్మెల్యే వెళ్లారు. పోర్టు వద్దకు వెళ్ళిన తర్వాత భద్రత సిబ్బంది అతిగా ప్రవర్తించడం వల్ల గందరగోళ వాతావరణం నెలకొన్నది. ప్రశాంతంగా జరిగే పోరాటంలో భద్రతా సిబ్బంది చిచ్చుపెట్టారు. మీడియా కవరేజ్ కోసం వెళ్లిన మీడియా బృందం ప్రయాణిస్తున్న వాహనాన్ని భద్రతా సిబ్బంది అడ్డుకున్నారు. దీంతో మీడియా వారికి భద్రతా సిబ్బందికి వాగ్వాదం జరిగింది. దీంతో విషయం తెలుసుకున్న సోమిరెడ్డి వాహనం దిగివచ్చి భద్రతా సిబ్బందిని నిలదీశారు. తనతో వస్తున్న మీడియాను ఎందుకు అడ్డుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో అడ్డుకున్న సెక్యూరిటీ అధికారిపై ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు. మీడియా వారికి సోమిరెడ్డి మద్దతుగా నిలిచారు. అక్కడ ఉన్న పోలీస్ అధికారులు భద్రత సిబ్బందిని వారించారు. అన్ని అనుమతులు తీసుకొని పోర్టులోకి వస్తుంటే అడ్డుకోవడం ఏమిటని ప్రశ్నించారు. తదుపరి కృష్ణపట్నం పోర్టు సీఈవో జగదీష్ పటేల్‌తో సోమిరెడ్డి మాట్లాడారు. కంటైనర్ సేవలు పునరావృతం చేయాలన్నారు. సీఈఓకు వినతిపత్రం ఇచ్చి పరిపాలన భవనంలో సిఈఓతో బేటి కావడం జరిగింది. కంటైనర్‌పై ఎమ్మెల్యే చర్చించారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పునరావృతం కాకుండా ప్రజా సమస్యలను పరిష్కరించండి



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికను నెల్లూరు నగర పాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ విభాగం సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించారు. అదనపు కమిషనర్ నందన్ పాల్గొని అర్జీదారుల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వివిధ అంశాలపై ప్రజల నుంచి అందుకున్న ఫిర్యాదులు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం అందించాలని, వాటన్నింటికీ నిర్ణీత సమయంలోగా పరిష్కారం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం అందుకున్న వినతులు పునరావృతం కాకుండా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో శాశ్వత పరిష్కారం అందించాలని అదనపు కమిషనర్ సంబంధిత సెక్షన్ అధికారులకు సూచించారు. విభాగాల వారీగా ఇంజనీరింగ్-10, టౌన్‌ప్లానింగ్-2, పబ్లిక్‌హెల్త్-2, హౌసింగ్-11, రెవెన్యూ-5, మొత్తం 30 ఫిర్యాదులను ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నగర పాలక సంస్థ సిటీ ప్లానర్ కృష్ణ కిషోర్, ఇతర అన్ని విభాగాల అధికారులు, సూపరెంటెండెంట్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.



సూర్య

రిపోర్టర్స్ కావలెను

తెలుగు పత్రికా రంగంలో అందరి మన్ననలు పొంది పాఠకుల హృదయాలను దోచుకున్న నేటి దిన పత్రిక సూర్య నందు విలేకర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ యువకుల కావలెను.

కావలసిన సెంటర్లు

నెల్లూరు జిల్లాలోని అల్లూరు, దగదర్తి, దుత్తలూరు, కొండాపురం, చేజర్ల, మనుబోలు, కొడవలూరు, బుచ్చి, కోవూరులలో విలేకర్లు కావలెను.

మీ పూర్తి బయోడేటాతో వారంలోపు క్రింది చిరునామాలో సంప్రదించగలరు.

సూర్య కార్యాలయం, మిలిటరీ కాలనీ, రోడ్ నెం.1, LIC & CID ఆఫీసు ఎదురుగా, కొండాయపాలెం గేట్ సెంటర్, నెల్లూరు.

సెల్: 9000 118811, 9966 49 71 49


# ఉదయగిరిని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే కాకర్ల కృషి



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి దుర్గాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ కృషి చేస్తున్నారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి, మండల టీడీపీ కన్వీనర్ చింతన బోయిన బయ్యన్నలు పేర్కొన్నారు. సోమవారం ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆదేశాల మేరకు పురావస్తు, ఆర్ అండ్ బీ శాఖ అధికారులతో కలిసి దుర్గం ప్రాంతంలో చారిత్రాత్మక కట్టడాలను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే దుర్గాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టారన్నారు. అందులో భాగంగా పురావస్తు, ఆర్ అండ్ బీ శాఖాధికారులు దుర్గాన్ని పరిశీలించి నివేదికలు తయారు చేస్తారన్నారు. అభివృద్ధి చేయాల్సిన పనులను గుర్తించి నివేదిక రూపంలో ప్రభుత్వానికి నిధుల కోసం ప్రతిపాదనలు పంపడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేసేలా చర్యలు చేపట్టిదుర్గం అభివృద్ధికి చర్యలు చేపడతార న్నారు. దీంతో ఉదయగిరి దుర్గానికి మహర్దశ పట్టనుందని తెలిపారు. అదేవిధంగా మండల పరిధిలోని ఘాట్ రోడ్ నో కూడా ఆర్ అండ్ బి అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్ అండ్ బీ డీఈ మదన్ కుమార్, ఏఈ మస్తాన్, పురావస్తు శాఖాధికారులు ఓబులరెడ్డి, నారాయణరెడ్డి, గంగాధర్, ప్రసాద్, వెంగళరావు, రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నేడు నారా లోకేష్ ఆరోగ్య రక్ష కార్యక్రమం

**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఆదేశాల మేరకు టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి సూచనతో నారా లోకేష్ ఆరోగ్య రక్ష కన్వీనర్ చాట్ల చక్రవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో నేడు నెల్లూరు రూరల్ మండలంలోని గొల్ల కందుకూరు, సజ్జాపురం గ్రామాలలో మంగళవారం ఉదయం 9గంటలకు నారా లోకేష్ ఆరోగ్యరక్ష కార్యక్రమం రెండో విడతగా ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించడం జరుగుతుంది. కావున గ్రామాలలో ప్రజలందరూ సద్వినియోగించుకోవాలని కోరారు.

